సాక్షి కామారెడ్డి

ఆదివారం । 26 । మే । 2024



సద్వినియోగం చేసుకోవాలి

మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం అధికారి సూచించారు.

- 9లో ▸



వేగవంతం చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల ను పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.9 /25.0

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'పనులను సకాలంలో పూర్తి చేయాలి'



రామారెడ్డి: పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన సదాశివనగర్, తిర్మన్‌పల్లి గ్రామాలలో పర్యటించి, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. పనులను పురోగతిపై ఏంఈవో, హెచ్‌ఎంలతో మాట్లాడారు. అనంతరం గ్రామపంచాయతీలను సందర్శించి పల్లె ప్రకృతి వనం, క్రిమిటోరియం, కంపోస్ట్ షెడ్, నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్ కుమార్, డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, పీఆర్ ఏఈ మారుతి, ఎంఈవో యోసఫ్, ఏపీఎం రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మాధవీలత, నరేష్ తదితరులున్నారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం జరిగిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 599 మంది విద్యార్థులకుగాను 561 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెంకడియర్ పరీక్షకు 979 మందికిగాను 933 మంది హాజరయ్యారు. పరీక్షలను జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జాతీయ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన అభ్యర్థుల నుంచి పద్మ అవార్డు కోసం సిఫార్సు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు అవసరమైన డాక్యుమెంట్లను సెట్లు, 800 పదాలకు మించకుండా అభ్యర్థి చేసిన కార్యక్రమాల గురించి వివరిస్తూ రాసిన పత్రాన్ని జూన్ ఒకటో తేదీలోపు జిల్లా యువజన, క్రీడల కార్యాలయం(స్టెప్), సుభాష్ నగర్, ఇన్‌కం టాక్స్ కార్యాలయం వద్ద సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం www.padmaawards.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



బీబీపేట : మండల కేంద్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రంతో పాటు తుజాల్‌పూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకం వేసిన సంచులను తక్షణమే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. మిగిలిన ధాన్యాన్ని సైతం వెంటనే తూకం వేయాలన్నారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి ఇప్పటివరకు 95 శాతం ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తయిందని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సత్యానారాయణ, సొసైటీ సీఈవో నర్సాగౌడ్ తదితరులు ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరం సందర్శన



గాంధారి(ఎల్లారెడ్డి): రాంపూర్ గడ్డ తండాలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని శనివారం జిల్లా క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి సందర్శించినట్లు పీఈటీ లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. శిక్షణ ఏ విధంగా సాగుతుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పీఈటీ లక్ష్మణ్ ప్రత్యేక శ్రద్ధతో వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

పంచ్ కొడితే పతకమే..!



ఏదైనా ఒక లక్ష్యంపై గురి పెట్టినపుడు మరో దృష్టి ఉండకూడదు. దాన్ని సాధించే వరకు విడిచి పెట్టకూడదు. లక్ష్యాన్ని సాధించాలన్న తపన ఉంటే ఏదైనా సాధించొచ్చు అని రుజువు చేస్తున్నారు పిట్లం మండలం తక్కడ్‌పల్లికి చెందిన ప్రతిభ. తను ఎంచుకున్న మార్గంలో ఎన్నో కష్టాలకు ఎదురొడ్డి నిలిచి విజయాల బాటపట్టారు. ఎనిమిది రకాల యుద్ధ క్రీడలు నేర్చుకుని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుతున్న ప్రతిభ విజయ గాథపై సండే స్పెషల్..

- మార్షల్ ఆర్ట్స్‌లో 'ప్రతిభ'
- ఎనిమిది రకాల క్రీడల్లో ప్రావీణ్యం
- పలు రికార్డుల్లో చోటు

సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి : పిట్లం మండలం తక్కడపల్లి గ్రామానికి చెందిన శ్యామల, నర్సింగరావు దంపతుల కూతురు ప్రతిభకు చిన్నప్పటినుంచి మార్షల్ ఆర్ట్స్ అంటే ఇష్టం. ప్రముఖ బాక్సర్ మైక్‌టైసన్ వీడియోలు చూసి ఇన్‌స్పైర్ అయిన ప్రతిభ.. బాక్సింగ్‌లో ప్రవేశించాలనుకుంది. ఉన్నత విద్య కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ప్రతిభ.. అక్కడ చదువుకుంటూనే పార్ట్‌టైం జాబ్ చేసి యుద్ధ విద్యలపై దృష్టి సారించింది. ఒక్కటొక్కటిగా నేర్చుకుంటూ ముందుకు నడిచింది. కిక్ బాక్సింగ్, ముయె థాయ్, తైక్వాండో, వుషు, చెస్ బాక్సింగ్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సీలంబం, వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడలు నేర్చుకుంది. ఎనిమిదేళ్లుగా ఈ యుద్ధ క్రీడల మీదే ఫోకస్ చేస్తున్న ప్రతిభ.. రాత్రింబవళ్లు కష్టపడుతోంది. దీంతో పంచ్ కొడితే పతకం రావాల్సిందే అన్న స్థాయికి చేరింది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఎన్నో రికార్డులు నమోదు చేసింది. యుద్ధ విద్యలు నేర్చుకుంటూ, టోర్నీల్లో సత్తా చాటుతూనే డిగ్రీ ఆ తర్వాత ఎంబీఏ పూర్తి చేసిన ప్రతిభ.. ప్రస్తుతం తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ (టీఎస్‌పీఏ)లో కొత్తగా రిక్రూట్ అయిన మహిళా కానిస్టేబుళ్లకు సెల్ఫ్ డిఫెన్స్ మీద శిక్షణ ఇస్తోంది.



బ్రిటిష్ తైక్వాండో చాంపియన్ షిప్‌లో సాధించిన సిల్వర్ మెడల్‌ను ప్రదర్శిస్తున్న ప్రతిభ

సాధించిన పతకాలు..

- చెస్ బాక్సింగ్ వరల్డ్ చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్
- ఫిట్ చెస్ బాక్సింగ్‌లో సిల్వర్ మెడల్
- బ్రిటిష్ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్
- ఓపెన్ తైక్వాండో చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్
- కిక్ బాక్సింగ్ సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్
- మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో గోల్డ్ మెడల్
- థాయ్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్



ఎనిమిదేళ్లలో ఎన్ని పతకాలో...

ప్రతిభ ఐదు ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్స్ సాధించింది. మార్షల్‌ఆర్ట్స్, కోంబట్ స్పోర్ట్స్‌లో వరల్డ్ స్థాయి పోటీల్లో మూడు గోల్డ్ మెడల్స్, నేషనల్స్‌లో 13 గోల్డ్ మెడల్స్ సాధించింది. అలాగే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్–2022, జాకీ బుక్ ఆఫ్ టాలెంట్స్–2021 లో చోటు సంపాదించుకుంది.

ప్రోత్సాహం అవసరం

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ సమాజంలో ఇంకా చిన్నచూపు ఉంది. ఆడపిల్లలను ప్రోత్సహించాల్సింది పోయి ఇబ్బందులు పెట్టడం సరికాదు. ముఖ్యంగా ఆటల్లో రాణిస్తున్నవారికి ప్రోత్సాహం అవసరం. ఎంబీఏ చదివే సమయంలో చేతికి గాయమైంది. అప్పుడు అమ్మానాన్నలకు తెలిసి బాధపడ్డారు. ఆడపిల్లలకు ఇవి పనికిరావన్నారు. అయినా గాయం తగ్గిన తర్వాత మళ్లీ సాధన చేశా. మేరికోం లాగా ప్రపంచంలో నంబర్ వన్ బాక్సర్‌గా పేరు సంపాదించాలన్నది నా లక్ష్యం. ఆ దిశగా కసరత్తు చేస్తున్నాను.

– ప్రతిభ, తక్కడ్‌పల్లి, పిట్లం మండలం

వైద్యశాఖ గాడిలో పడేనా?

- లైంగిక వేధింపుల కేసులో డీఎంహెచ్‌వోపై సస్పెన్షన్ వేటు
- కార్యాలయ సూపరింటెండెంట్‌పైనా చర్యలు
- శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తేనే ప్రయోజనం



కామారెడ్డి టౌన్: వైద్య శాఖను గాడిలో పెట్టాల్సిన అధికారే తప్పుడు చర్యలకు పాల్పడి ఆ శాఖకు మాయని మచ్చ తెచ్చారు. తోటి ఉద్యోగులను లైంగికంగా వేధించి అభాసుపాలయ్యారు. ఈ వ్యవహారంలో విచారణ అధికారి ఇచ్చిన నివేదిక మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్ చర్యలు చేపట్టారు. డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ తమను లైంగికంగా వేధిస్తున్నాడంటూ జిల్లాలోని పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్యాధికారులు ఇటీవల వైద్య శాఖ ఉన్నతాధికారులతోపాటు దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఈనెల 15న అరెస్ట్ చేయగా.. 16న బెయిల్‌పై విడుదలయ్యాడు. అలాగే లైంగిక వేధింపుల వ్యవహారంలో ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ కామారెడ్డికి వచ్చి విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. ఆ నివేదిక ఆధారంగా డీఎంహెచ్‌వోను సస్పెండ్‌చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓ వైద్యురాలిపై వేధింపులకు పాల్పడిన కేసులో ఈనెల 21న డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. వైద్య శాఖలో ఇద్దరిపై సస్పెన్షన్ పడడంతో ఈ శాఖను పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మరికొందరు అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది.

ప్రక్షాళన జరిగేనా?

జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో పని చేసే ముగ్గురు ఉద్యోగులు శాఖను భ్రష్టు పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జిల్లా వైద్యాధికారిగా ఎవరు వచ్చినా.. వారిని తప్పుదారి పట్టిస్తున్నారని తెలుస్తోంది. డీఎంహెచ్‌వోలను బుట్టలో వేసుకుంటూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌లు, కాంట్రాక్ట్ పోస్టుల భర్తీ, అక్రమ డిప్యుటేషన్‌ల వ్యవహారంలో డీఎంహెచ్‌వో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా ఈ అవినీతి వ్యవహారాలలో ఆ ముగ్గురు ఉద్యోగులదే కీలక పాత్రని తెలుస్తోంది. ఆ ముగ్గురిపై చర్యలు తీసుకుంటేనే వైద్య శాఖ గాడిలో పడే అవకాశాలున్నాయి. జిల్లా వైద్య శాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

29న నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీ ఎన్నిక

ఎల్లారెడ్డిరూరల్: నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీ ఎన్నికను ఈనెల 29న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారి, మాల్తుమ్మెద విత్తన క్షేత్రం ఏడీఏ వీరాస్వామి తెలిపారు. నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీ రాజ్‌దాస్‌పై గత నెల 4న ఆర్డీవో మన్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో అవిశ్వాస పరీక్ష నిర్వహించారు. ఎంపీటీసీలు వైస్ ఎంపీపీకి వ్యతిరేకంగా చేతులు లేపడంతో వైస్ ఎంపీపీ రాజ్‌దాస్ పదవి కోల్పోయారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల అధికారులు నిర్ణయించారు. ఈనెల 29న ఎన్నిక నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



'ప్రణాళికతో సిద్ధమైతే విజయం సాధ్యం'



కామారెడ్డి అర్బన్: చక్కటి ప్రణాళికలతో పోటీ పరీక్షలకు సిద్ధమైతే విజయం తప్పక వరిస్తుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్స్, ఇతర ఉద్యోగాల కోసం ఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. శనివారం ఐఏఎస్ అధికారి సలహాలు, సూచనల తరగతి నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొని వివిధ అంశాలను వివరించారు. ప్రతి ఉద్యోగానికి వేలాది మంది పోటీ పడుతున్న తరుణంలో సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం, సమయస్ఫూర్తి, ప్రణాళికా బద్ధంగా నిత్యం చదవడం ఎంతో ముఖ్యమన్నారు. ఉద్యోగం రాకపోతే నిరుత్సాహ పడకుండా మరోసారి పోటీ పడాలని సూచించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాలు ఒకే ప్రయత్నంలో పొందిన వారితో పాటు రెండుసార్లు రాసిన వారూ ఉంటారన్నారు. వచ్చేనెల చివరి వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని జిల్లా ఎస్సీ అభివృద్ధి జిల్లా అధికారి రజిత తెలిపారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు తన పెళ్లిరోజు సందర్భంగా నోటు తో పాటు ఉచిత స్టడీ మెటీరియల్‌ను అభ్యర్థులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి సహాయ అధికారి వెంకటేష్, కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాలి

- ఐసీఏఆర్– ఏటీఏఆర్ఐ హైదరాబాద్ జోన్ డైరెక్టర్ షేక్ ఎన్.మీరా

రుద్రూర్: రైతులు విలువ ఆధారిత వ్యవసాయం వైపు దృష్టి సారించి ఆదాయాన్ని పెంపొందించుకోవాలని ఐసీఏఆర్– ఏటీఏఆర్ఐ హైదరాబాద్ జోన్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా సూచించారు. శనివారం ఆయన రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. కేవీకేలో ఏర్పాటు చేసిన భూసార పరీక్ష కేంద్రం, వ్యవసాయ సమాచార కేంద్రాలను ప్రారంభించారు. వర్మి కంపోస్ట్ విభాగం, మామిడి అంట్ల విభాగం పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న కార్యక్రమాలపై కేవీకే సిబ్బంది, రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, వివిధ మాధ్యమాల ద్వారా వినూత్నంగా మార్కెటింగ్ చేయడం వల్ల ఆదాయం పొందవచ్చన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కొత్త పంటలు వేయాలని, ఆదాయమే లక్ష్యంగా పాడితో పాటు వ్యవసాయాధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించి ఆన్‌లైన్ అమ్మకాలు చేసేందుకు ప్రయత్నం చేయాలన్నారు. పసుపు, పసుపు ఆధారిత ఉత్పత్తులను బ్రాండింగ్ చేస్తూ విక్రయిస్తున్న మోర్తాడ్ ఫెడ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులను ఆయన అభినందించారు.

రుద్రూర్ కేవీకేకు స్పెషల్ ఫండ్స్

ఇరవై ఏళ్లుగా రైతులకు సేవలందిస్తున్న రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రానికి స్పెషల్ ఫండ్ మంజూరు చేస్తామని డాక్టర్ మీరా తెలిపారు. రైతుల భాగస్వామ్యంతో వ్యవసాయాభివృద్ధికి, వ్యవసాయంలో మంచి మార్పులు తీసుకురావడానికి ప్రతిపాదనలు చేస్తే నాబార్డు ద్వారా అవసరమైన సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రుద్రూర్, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు డాక్టర్ అంజయ్య, శివకృష్ణ, నాబార్డు డీడీఎం మోహన్, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల డీన్ కల్పన, కేవీకే శాస్త్రవేత్తలు బీవీ రాజ్‌కుమార్, పి.విజయ్ కుమార్, ఎం.శ్వేత పాల్గొన్నారు.



మామిడి మొక్కలకు అంటుకట్టే విభాగాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ షేక్ ఎన్ మీరా

లక్ష్యానికి చేరువలో కొనుగోళ్లు

- జిల్లాలో 2.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లో రూ.571 కోట్లు జమ చేసిన ప్రభుత్వం
- తుది దశకు చేరిన కొనుగోళ్ల ప్రక్రియ

నిజాంసాగర్: యాసంగి సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం సేకరణ ప్రక్రియ లక్ష్యాన్ని అధిగమించే దిశగా సాగుతోంది. 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం కాగా.. ఇప్పటికే 2.97 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. మరో రెండు మూడు రోజుల గడువుండడంతో లక్ష్యానికి మించి కొనుగోళ్లు జరిగే అవకాశాలున్నాయి.

జిల్లాలో 2.45 లక్షల హెక్టార్లల్లో వరి సాగయ్యింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో 327, ఐకేపీ ఆధ్వర్యంలో 23 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం సేకరణ లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. సుమారు రెండు నెలల క్రితమే కొనుగోళ్లు ప్రారంభమైనా మూడు వారాల క్రితమే తూకాలు వేగం పుంజుకున్నాయి. ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటి వరకు 2.97 లక్షల మెట్రిక్ టన్నుల మేర వరిధాన్యాన్ని రైతులనుంచి కొనుగోలు చేశారు. ఆయా కేంద్రాల్లో 51,162 మంది రైతులు రూ. 656 కోట్ల విలువైన ధాన్యాన్ని విక్రయించారని అధికారులు తెలిపారు. ఇందులో ఇప్పటివరకు రూ. 571 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. మిగిలిన రైతుల ఖాతాలలో త్వరలోనే డబ్బులు జమ చేస్తామన్నారు. రెండుమూడు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి కానున్నాయి.



కొమలంచ కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

చనిపోయిందనుకొని వదిలేశారు

- కూతురి హత్యాయత్నంలో తల్లి కుట్ర
- ప్రియుడితో కలిసి అటవీ ప్రాంతంలో దారుణంగా దాడి
- తీవ్రగాయాలతో పడి ఉన్న బాలికను గుర్తించిన స్థానికులు
- పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలింపు

ఎడపల్లి(బోధన్): నవ మాసాలు మోసి కనిపెంచిన తల్లే.. తన కూతురిని చంపించాలని చూసింది. తమ శారీరక సంబంధానికి అడ్డుగా ఉందని తల్లి, ప్రియుడు కలిసి మరొకరి సహాయంతో హత్యాప్రయత్నం చేశారు. ఇందుకు పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేశారు. ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్, జాన్కంపేట్ గ్రామ శివారులో మైనర్ బాలిక (15) గురువారం తీవ్ర గాయాలతో పడి ఉండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు. పోలీసుల విచారణలో శనివారం హత్యాయత్నం కుట్ర వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.

నిజామాబాద్ నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన సరితకు విడాకులయ్యాయి. అనంతరం ఆమెకు అల్తాఫ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో తమకు అడ్డుగా ఉన్న మైనర్ బాలికను తొలగించుకోవాలన్న ప్రియుడి ప్లాన్‌కు సరిత ఓకే చెప్పింది. మైనర్ బాలికను ఠాణాకలాన్, జాన్కంపేట్ శివారులోని నిజాంసాగర్ కెనాల్ వద్ద గల మల్లన్నగుడి సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. వీరితో పాటు అల్తాఫ్ స్నేహితుడైన ఆటో డ్రైవర్ ఆరిఫ్ ఉన్నాడు. అక్కడ బాలికను తీవ్రంగా గాయపర్చిన తర్వాత ఉరి వేశారు. చనిపోయిందని భావించి బాలికను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. నిందితులు ఆటోలో మైనర్ బాలిక తమ్ముడిని(10) కూడా తీసుకెళ్లారు. అనంతరం అటుగా వెళ్లిన స్థానికులు తీవ్రగాయాలతో ఉన్న బాలికను గుర్తించి, ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించడంతో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాలిక ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాలిక తమ్ముడిని పోలీసులు సదరం హోంకు తరలించారు. బాలిక హత్యాయత్నంలో నిందితులైన సరిత, అల్తాఫ్, ఆరిఫ్‌లను రిమాండ్‌కు తరలించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ చందర్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు



ఎల్లారెడ్డి: వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో శనివారం తనిఖీలు చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్, ఎస్సై మహేశ్ దుకాణాల రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయించొద్దని, ధరల పట్టికను అందుబాటులో ఉంచాలని, ఈ పాస్ మిషన్ల ద్వారా ఎరువులు అందించాలని నిర్వాహకులకు సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన సంస్థలకు సంబంధించిన అన్ని రసీదులను రికార్డుల్లో భద్రపర్చాలన్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి శనివారం తనిఖీలు నిర్వహించారు. తిరుమల, వీరభద్ర ఫర్టిలైజర్ దుకాణాల్లో గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండల వ్యసాయాధికారి అనిల్‌కుమార్, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి



బాన్సువాడ : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసుకునే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే అందించాలని ఫర్టిలైజర్ యజమానులకు బాన్సువాడ ఏడీఏ వీరస్వామి సూచించారు. శనివారం బాన్సువాడ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన ఫర్టిలైజర్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, సీల్ సరిగ్గా ఉన్న బస్తాలు, ధ్రువీకరణ పత్రం ట్యాగ్ ఉన్న వాటినే రైతులకు ఇవ్వాలని సూచించారు. డీలర్లు రిజిస్టర్‌లో రైతుల వివరాలు పూర్తిగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఈవో రాణి, డీలర్లు తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ధ్వంసం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ప్రధాన రోడ్డులో నగల తయారీ దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాలను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నిప్పుపెట్టి ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా.. గుర్తు తెలియని వ్యక్తి ముఖానికి టవల్ కట్టుకుని కర్రతో సీసీ కెమెరాలకు నిప్పు పెట్టినట్లు రికార్డయ్యిందన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలాన్ని ఎస్సై ఆంజనేయులు పరిశీలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్ నాగారం: నగరంలోని రాజారాం స్టేడియంలో ఈ నెల 31, జూన్ 1వ తేదీన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-8,10,12,14,16 విభాగంలో బాల బాలికల విభాగంలో ఎంపికలు ఉంటాయని అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని, రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు ఎంట్రీ ఫీజుగా రూ.100 తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు సర్టిఫికెట్, మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్, వ్యక్తిగత చాంపియన్‌షిప్ అందజేస్తామన్నారు. ఈ నెల 29న సాయంత్రం 5గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే సర్టిఫికెట్లు ఉంటాయని స్పష్టం చేశారు. ఎంపికైన వారిని జూన్ 6, 7 తేదీల్లో హనుమకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 99890 40776 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రాణం పోస్తున్నారు..

- రోడ్డు ప్రమాద క్షతగాత్రులను కాపాడుతున్న 108 పైలట్లు
- నేడు '108 పైలట్ డే'



అంబులెన్స్‌లో ప్రసవం అనంతరం తల్లీబిడ్డను ఆస్పత్రికి చేర్చిన సిబ్బంది (ఫైల్)



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఆర్మూర్ టౌన్: ఎక్కడ ఎటువంటి ప్రమాదం జరిగిన వెంటనే అందరికీ గుర్తుకు వచ్చేది 108 అంబులెన్స్. సమాచారం అందిన వెంటనే 108 అంబులెన్స్ పైలట్లు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడంతోపాటు సమీప ఆస్పత్రులకు తరలించి ప్రాణాలను కాపాడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి 2005 ఆగస్టు 15న '108 అంబులెన్స్' సేవలను ప్రారంభించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని దేశంలోని 16 రాష్ట్రాల్లో '108' సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. పక్కన దేశమైన శ్రీలంకలోనూ సేవలందుతున్నాయి. కొవిడ్ విపత్కర పరిస్థితుల్లో అంబులెన్స్ పైలట్లు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఎంతోమంది రోగులను ఆస్పత్రులకు తరలించి ప్రాణాలను కాపాడారు. ప్రమాదం చోటుచేసుకున్న ఘటనాస్థలం నుంచి బాధితులను గంటలోపు ఆస్పత్రికి తరలించే సమయాన్ని గోల్డెన్ అవర్‌గా భావిస్తారు. ఈ సమయంలో ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా, నిర్లక్ష్యం వహించినా భారీమూల్యం చెల్లించాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని 108 సిబ్బంది క్షతగ్రాతులను దేవుళ్లలా కాపాడుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో 17 అంబులెన్సులు ఉండగా, 34 మంది పైలట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 2500మంది ప్రాణాలను 108 పైలట్లు కాపాడుతున్నారు.

ఆనందంగా ఉంది



108 అంబులెన్స్‌లో పని చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రుల ప్రాణాలను కాపాడడం ఆనందంగా ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని బాధితులకు చికిత్స అందించి రెట్టింపు వేగంతో ఆస్పత్రులకు తరలించడం మా విధి. ఈ క్రమంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వేలాది మందికి సేవలు అందిస్తున్నాం. – ఎల్ గణేశ్, 108 పైలట్, ఆర్మూర్

గోల్డెన్ అవర్ కీలకం



ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను నుంచి గంటలోపు ఆస్పత్రికి తరలించాలి. దీనినే గోల్డెన్ అవర్‌గా భావిస్తాం. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం. ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించి వారి ప్రాణాలను కాపాడినప్పుడు ఎంతో సంతృప్తి ఉంటుంది. – జి రూపేశ్, 108 పైలట్, ఆర్మూర్

సెమీస్‌కు జాతీయస్థాయి క్యారం పోటీలు



నిజామాబాద్‌నాగారం: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూషనల్ క్యారం చాంపియన్‌షిప్ పురుషుల, మహిళల వ్యక్తిగత పోటీలు సెమీఫైనల్‌కు చేరాయి. మూడో రోజైన శనివారం నిర్వహించిన క్వార్టర్స్‌లో మహిళల వ్యక్తిగత విభాగంలో ఆకాంక్ష, మందస హాజీమా, నాగజ్యోతి, పురుషుల విభాగంలో కే శ్రీనివాస్, గూఫ్రాన్, ప్రశాంత్ మోరే యోగేశ్ పరదేశీ సెమీఫైనల్‌కు చేరారు. అంతర్జాతీయ క్రీడాకారుల మధ్య వ్యక్తిగత పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఆదివారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించనున్నామని ఇంటర్నేషనల్ క్యారం అసోసియేషన్ కార్యదర్శి వీడీ నారాయణ, ఆల్ ఇండియా క్యారం అసోసియేషన్ కార్యదర్శి భారతి నారాయణ, తెలంగాణ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు. క్యారం టోర్నీ యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో కొనసాగుతోందన్నారు. యూనియన్ బ్యాంక్ ఏజీఎం రాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై శనివారం నాటి పోటీలను వీక్షించారు. కార్యక్రమంలో ప్రవీణ్, శోభన్ పాల్గొన్నారు.

మత్స్య శాఖ ఏడీని బదిలీ చేయాలి

- అవినీతికి పాల్పడుతున్నాడని అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మత్స్య పారిశ్రామిక సంఘం నాయకులు

డొంకేశ్వర్(ఆర్మూర్): మత్స్య శాఖ ఏడీ రాజనర్సయ్య అవినీతికి పాల్పడుతున్నారని, ఆయనను జిల్లా నుంచి బదిలీ చేయాలంటూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. మత్స్య శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తూ జిల్లాలో పట్టు సాధించాడని, నిబంధనలకు విరుద్ధమైన పనులు చేస్తున్నాడని ఆరోపించారు. బలవంతంగా వేరే కులాల వారికి కొత్త సంఘాలు చేస్తున్నారని, దీంతో అసలైన గంగపుత్రులకు అన్యాయం జరుగుతోందన్నారు. మహిళా మత్స్యకార సంఘాలను కూడా డబ్బులు తీసుకుని చేశారని ఆరోపించారు. చేప పిల్లల పంపిణీలో గుత్తేదార్లతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నాడని, చెరువుల్లో నాణ్యతలేని పిల్లలు వేస్తున్నారని అన్నారు. అదే విధంగా స్కిల్ టెస్టులు సైతం డబ్బులు ఇవ్వందే చేయడం లేదన్నారు. జిల్లాలో దాదాపు 35 ఏళ్లుగా వివిధ హోదాల్లో పని చేసి ఎనలేని అవినీతికి పాల్పడుతూ గంగపుత్రులను మోసం చేస్తున్నాడని, వెంటనే ఏడీని జిల్లా నుంచి బదిలీ చేయాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆనంద్, అన్నయ్య, నారాయణ, సాయిలు, గంగారాం ఉన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

పిట్లం(జుక్కల్): మండలంలో చిల్లర్గి గ్రామ శివారులోని వ్యవసాయభూమిలో విద్యుత్ షాక్ తగిలి సాయిలు అనే రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చిల్లర్గికి చెందిన సాయిలు (52) శుక్రవారం తన వ్యవసాయభూమిలోని వరి కొయ్యలకు నిప్పు పెట్టాడు. ఈ క్రమంలో మంటలు ఎక్కువ కావడంతో మంటలను ఆర్పేందుకు బోరుమోటార్‌ను స్టార్ట్ చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడి కుమారుడు జగన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరు..



సాయిలు

బాన్సువాడ : బీర్కూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన బసోళ్ల సాయిలు (38) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత ఆదివారం గాంధారికి చెందిన బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో అక్కడి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వారిఇంట్లో కింద పడడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హత్యలా.. ఆత్మహత్యలా..?

- తేల్చలేకపోతున్న పోలీసులు
- బాన్సువాడలో వారంలోనే ఇద్దరు మహిళలు, బాలుడి మృతదేహాలు లభ్యం



మృతిచెందిన బాలుడు, మహిళ (ఫైల్)

బాన్సువాడ : బాన్సువాడలో వారం రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలు, బాలుడి మృతదేహాలు లభ్యం కావడం కలకలం సృష్టించింది. వారివి హత్యలా..ఆత్మహత్యలా..? అనే విషయాన్ని తేల్చడంలో పోలీసులు తలమునకలయ్యారు. ఈనెల 19న బాన్సువాడ పట్టణంలోని వీక్లీ మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఓ మహిళ, బాలుడి మృతదేహాలు లభ్యమయ్యాయి. అప్పటికే రెండు మృతదేహాలు పూర్తిగా కుళ్లిపోవడంతో గుర్తు పట్టలేనంతగా ఉన్నాయి. పోలీసులు రెండు మృతదేహాలను ఆస్పత్రికి తరలించి పంచనామా చేయించారు. మహిళకు 30 నుంచి 35 ఏళ్లు ఉండగా, బాలుడికి 6 నుంచి 8 ఏళ్ల వయస్సు ఉండవచ్చని, వారిద్దరిది మద్నూర్ మండలం అని పోలీసులు కనిపెట్టారు. కానీ వారిది హత్య..? లేక ఆత్మహత్యా..? అనే విషయాన్ని పోలీసులు పోలీసులు నిర్ధారించలేకపోయారు. మృతుల సంబంధీకులు మాత్రం తమ వారిది హత్యేనని అనుమానాలు వ్యక్తం చేశారు.

ఇదిలా ఉంటే ఈనెల 23న మండలంలోని కృషానగర్ తండా సమీపంలోని అటవీప్రాంతంలో గాంధారి మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన కూరగాయలు అమ్ముతూ జీవిస్తున్న లక్ష్మి(37) అనే మహిళ మృతదేహం పోలీసులకు లభించింది. ఆమె మృతదేహం కూడా పూర్తిగా పూర్తిగా కుళ్లిపోయి ఉంది. జిల్లా ఎస్పీ సింధుశర్మ సంఘటనాస్థలాన్ని వచ్చి పరిశీలించారు. తల పగిలి, దవడ విరిగినట్లు ఉండటాన్ని పోలీసులు నిర్ధారించారు. గుర్తు తెలియని వ్యక్తులు లక్ష్మిని హత్యచేసి అటవీ ప్రాంతంలో పడేసినట్లు మృతురాలి బంధువులు ఆరోపిస్తూ పోలీసులకు పిర్యాదు చేశారు.

వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు మహిళలు, బాలుడు అనుమానాస్పదంగా మృతి చెండడం బాన్సువాడలో చర్చనీయాంశమైంది. బాన్సువాడలో చాలావరకు సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఈ సంఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి.

పోలీసుల అదుపులో నిందితులు?

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ అటవీప్రాంతంలో ఈనెల 23న మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు, మృతురాలిని గాంధారి మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన లక్ష్మిగా గుర్తించారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఘటనాస్థలాన్ని పరిశీలించిన కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. వారాంతపు సంతల్లో కూరగాయలు విక్రయించే లక్ష్మిని ఆమెకు తెలిసిన వారే అతి కిరాతకంగా హత్య చేసినట్లు తెలుస్తోంది. ఆమెను ఈనెల 16న ఆటోలో అటవీప్రాంతానికి తీసుకెళ్లి మద్యం తాగించి సామూహిక అత్యాచారం చేసినట్లు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. లక్ష్మి ఒంటిపై ఉన్న సుమారు 3తులాల బంగారు అభరణాలు, వెండి కడియాలు, రూ.15వేల నగదును లాక్కుని మద్యం మత్తులో ఉన్న ఆమె తలపై బండరాయితో మోది హత్యచేసి పారిపోయినట్లు తెలుస్తోంది. అటవీప్రాంతంలో మద్యం సేవించిన వారిలో లక్ష్మితోపాటు ఇతర మహిళలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్యతో సంబంధం ఉన్న బూర్గుల్, నెరెల్, చద్మల్ తదితర గ్రామాలకు చెందిన గిరిజన, గిరిజనేతర వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు త్వరలోనే నిందితులను రిమాండ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

బీడీ కార్మికుల వేతనాలు పెంపు

ఖలీల్‌వాడి: బీడీ కార్మికుల వేతనాలను పెంచాలని యాజమాన్యాలతో బీడీ కార్మిక సంఘాల నాయకులు చేపట్టిన చర్చలు సఫలమయ్యాయి. శనివారం హైదరాబాద్‌లోని ఓ ఇంటర్నేషనల్ హోటల్‌లో బీడీ కార్మిక సంఘాలు, బీడీ యాజమాన్యాలు వేతనాల పెంపుపై సుదీర్ఘంగా చర్చించాయి. వేయి బీడీలకు రూ.4.25 పైసలు, అలాగే నెలసరి ఉద్యోగుల వేతనాన్ని రూ.1700, ప్యాకర్లకు రూ.3,650 పెంచారు. జూన్ నుంచి పెరిగిన వేతనాలు అందనున్నాయని బీడీ యాజమాన్యాల తరఫున అధ్యక్షుడు హితేంద్ర ఉపాధ్యాయ, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర గాంధీ, రస్మికాంత్ పటేల్, రామన్‌భాయ్ పటేల్, ప్రభాకర్, బీడీ కార్మిక సంఘాల ప్రతినిధులు కేఎస్ స్వామి, ఎం రాజన్న తెలిపారు.

ఎస్సైపై అవినీతి ఆరోపణలు!

- ఉన్నతాధికారులకు కానిస్టేబుల్ వాట్సాప్ మెస్సేజ్
- డిచ్‌పల్లి సర్కిల్‌లోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఘటన

ఇందల్వాయి: ఇసుక, మొరం వ్యాపారుల వద్ద ఎస్సై డబ్బులు వసూలు చేశాడని కానిస్టేబుల్ ఆరోపణలు చేయడం కలకలం రేపుతోంది. డిచ్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇసుక, మొరం తరలిస్తున్న వారి నుంచి ఎస్సై ఏఏ సందర్భాల్లో ఎంతెంత వసూలు చేశాడనే వివరాలతో ఉన్నతాధికారులకు కానిస్టేబుల్ వాట్సాప్ మెస్సేజ్ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, సదరు కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌లో పెత్తనం చెలాయించాలని చూస్తున్నాడని, తనకు సహకరించకపోవడంతోనే తనపై ఆరోపణలు చేస్తున్నాడని సదరు ఎస్సై పేర్కొంటున్నారు. ఎస్సై, కానిస్టేబుల్ మధ్య సఖ్యత కుదరకపోవడంతోనే ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు.

యువతి అదృశ్యం

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ శనివారం తెలిపారు. శనివారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన యువతి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. యువతి ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

లిఫ్ట్ గుంతలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని గంజ్ మార్కెట్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవనం లిఫ్ట్ గుంతలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు శనివారం సమాచారం అందింది. ఈ మేరు పట్టణ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

బోధన్ రూరల్ : మద్యానికి బానిసై మండలంలోని ఊట్‌పల్లికి చెందిన మల్లేశ్(32) ఆత్మహత్య కు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. కూలీ పనులు చేసుకుంటూ జీవించే మల్లేశ్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు.

ఎట్టకేలకు చల్లారిన మంటలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణ అభివృద్ధి సంస్థ (టీటీడీసీ)లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు 24 గంటల తర్వాత చల్లారాయి. ఫైరింజన్ సిబ్బంది సూచన మేరకు డీఆర్డీవో సిబ్బంది శుక్రవారం రాత్రి జేసీబీని రప్పించి భవనం గోడను కూల్చి వేయించారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి మంటలను ఆర్పారు. శనివారం ఉదయం వరకు మంటలు పూర్తిగా ఆరిపోయాయి.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డిబార్

- బోధన్‌లో అబ్జర్వర్‌పై వేటు



ఆర్మూర్‌లోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షల్లో శనివారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇద్దరు, ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఒకరు డిబార్ అయ్యారన్నారు. వర్సిటీ పరిధిలోని 38 పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 8,930 మంది విద్యార్థులకు గాను 8,514 మంది హాజరు కాగా 416 మంది గైర్హాజరయ్యారని, అలాగే మధ్యాహ్నం నిర్వహించిన 1, 3, 5 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 477 విద్యార్థులకు గాను 440 మంది హాజరుకాగా 37 మంది గైర్హాజరైనట్లు వివరించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ అధ్యాపకుడు కే రాహుల్‌ను విధుల నుంచి తప్పించినట్లు చంద్రశేఖర్ తెలిపారు. ఆర్మూర్, కామారెడ్డి లోని పలు పరీక్షా కేంద్రాలను ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరీ తనిఖీ చేశారన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

- ముగ్గురిపై మాల్‌ప్రాక్టీస్ కేసు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. మొదటి సంవ త్సరం పరీక్ష 32 కేంద్రాల్లో నిర్వహించగా, 2,878 మంది విద్యార్థులకు గాను 2,652 మంది హాజరు కాగా 226 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ వివరించారు. మధ్యాహ్నం రెండో సంవత్సరం పరీక్షను 31 కేంద్రాల్లో నిర్వహించగా, 934 మందికిగాను 858 మంది హాజరుకాగా 76 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల 'బి' సెంటర్‌లో సెకండియర్ విద్యార్థులు ముగ్గురు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు డీఐఈవో తెలిపారు.

రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రేమ్‌లాల్



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లాకు చెందిన టీచర్, రచయిత బానోత్ ప్రేమ్‌లాల్‌ను తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీశ్‌రెడ్డి తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా పత్రికారంగంలో రాణిస్తూ, వ్యాసాలు రాస్తూ అందరి అభిమానాన్ని చూరగొంటున్న ప్రేమ్‌లాల్ ప్రతిభను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించామన్నారు. ఈ సందర్భంగా ప్రేమ్‌లాల్ రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సిమెంట్ అన్‌లోడింగ్.. మొరం లోడింగ్

- మొరం పెద్ద లారీల పట్టివేత
- పోలీస్ స్టేషన్‌కు తరలింపు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): సిమెంట్ కంపెనీ నుంచి నుంచి తాడ్వాయి, లింగంపేట్ మండలాలకు లోడ్‌తో వస్తున్న లారీల్లో అన్‌లోడింగ్ తరువాత స్థానికంగా లభించే మొరాన్ని తరలిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి మీదుగా మొరాన్ని తరలిస్తున్న పెద్ద లారీలను పట్టుకొని స్థానిక పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన లారీల వివరాలను సేకరించి మైనింగ్ అధికారులకు పంపిస్తామనినే ఏఎస్సై సంజీవులు తెలిపారు. మండలం నుంచి ప్రతిరోజూ జోరుగా మొరం తరలుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు అనుమతుల పేరిట నిర్దేశిత మొత్తానికి మించి మొరాన్ని తరలిస్తున్నారు. దేమికలాన్-ఎర్రపహాడ్ మధ్యలో ఉన్న పెద్దగుట్టను తవ్వి రాత్రిపగలూ తేడా లేకుండా తరలిస్తున్నారు.

రూ.1.61 కోట్ల నగదు, బంగారం విడుదల

- ముగిసిన పెండింగ్ కేసుల విచారణ

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ఎన్నికల సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎస్‌టీటీ, ఎఫ్ఎస్‌టీ, పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఇప్పటివరకు నమోదైన 55 కేసులకు సంబంధించి రూ. 1.61 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి వస్తు వులను రిలీజ్ చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం జిల్లా గ్రీవెన్స్ కమిటీ సమావేశమై పెండింగ్‌లో ఉన్న ఒక కేసుపై విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు తనిఖీల్లో పట్టుబడి సీజ్ చేసిన నగదు, బంగారం, వెండి వస్తువులను జిల్లా గ్రీవెన్స్ కమి టీలో విచారించి విడుదల చేశామన్నారు. అందులో రూ. 1.33 కోట్ల నగదు కాగా, మరో రూ. 28 లక్షల విలువైన బంగారంతోపాటు పెన్నులు, టీ షర్ట్స్, స్టిక్కర్లు ఉన్నాయని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

మూడోసారి దేశంలో మోదీ హవా



ఆర్మూర్: దేశంలో మూడోసారి మోదీ హవా కొనసాగుతోందని ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడు అన్నారు. పట్టణంలోని ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒడిశాలో ప్రచారానికి వెళ్లి వచ్చిన ఆయన అక్కడి పరిస్థితులను వివరించారు. ఒడిశాలోని 21 ఎంపీ స్థానాల్లో 15కు పైగా బీజేపీ గెలుచుకోనుందన్నారు. అదేవిధంగా మహారాష్ట్రలోని 48 స్థానాల్లో 40కి పైగా, ఛత్తీస్‌గఢ్‌లో మెజారిటీ స్థానాలను గెలుచుకోనుందన్నారు. మూడోసారి మోదీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నాయకుడు కొక్కుల విద్యాసాగర్, ఎన్ఆర్ఐ చిగుర్ల మహేశ్, న్యాయవాది బాలయ్య పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన జోగిని ఎర్ర మల్లయ్యకు చెందిన 16 గొర్రె పిల్లలు కుక్కల దాడిలో శనివారం మృతి చెందాయి. తన కొట్టం వద్ద గూడ్కలో గొర్రెపిల్లలను వేసి మిగతా జీవాలను మేతకు తీసుకెళ్లానని, సాయంత్రం వచ్చి చూసే సరికి 16 పిల్లలు మృతి చెందాయని బాధితుడు మల్లయ్య తెలిపాడు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని తనను ఆదుకోవాలని కోరాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లో శుక్రవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. తిమ్మాపూర్‌కు చెందిన రాజు తన బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో ఇంటికి తాళం వేసి బీర్కూర్‌కు వెళ్లాడు. శనివారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. దుండగులు బీరువాలోని 7 గ్రాముల బంగారం నగలు, 11 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయ హుండీ..

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో దుండగులు హుండీ చోరీ చేశారు. కట్టర్‌తో హుండీని ధ్వంసం చేసిన దుండగులు సుమారు రూ.10వేల నగదుతోపాటు ఇతర కానుకలను ఎత్తుకెళ్లారని భక్తులు తెలిపారు. గతంలోనూ ఆలయంలో ఇదే తరహాలో పలుమార్లు చోరీ జరిగింది. ఆలయ ఈవో సమాచారం అందించగా పోలీసులు ఆలయానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

SERVICES

LOANS

■ గృహనిర్మాణ, తనఖా (మార్టిగేజ్), పర్సనల్ ఒపెన్‌ప్లాట్, వ్యాపార, సింగిల్ డాక్యుమెంట్, పెంకుటిల్లు, వ్యవసాయ, నోప్లాన్ పర్మిషన్ మరియు అన్ని రకాల లోన్స్ చేయబడును. సం॥ 9948512340, 8886016777. [Z-795628]

WANTED

■ నిజామాబాద్‌లోని ప్రముఖ ఫ్లెక్స్ షాప్ యందు పనిచేయుటకు అనుభవం కలిగిన DTP ఆపరేటర్స్ (MALE) కావలెను. 9949094103. [Z-795634]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185088]

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ ఆఫీస్ అసిస్టెంట్స్, నర్సులు, లేడీ కేర్ టేకర్స్, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ 8391036331, 9246585901. [HA-14041]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-799726]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640258899/ 9640468899. [H-799885]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.